జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సిద్దిపేట
గురువారం | 11 | జూన్ | 2026 | పేజీలు : 7




## దేశానికే దిక్సూచిగా
# మహిళా శక్తి పథకం

**మహిళా సంఘాలే ఇప్పుడు ఆర్టీసీ బస్సుల యజమానులు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

సిద్ధిపేట,జూన్ 10,(ప్రజాజ్యోతి):మహిళా సాధికారతను కేవలం నినాదంగా కాకుండా ఆచరణలో చూపిస్తూ తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం, అదే మహిళలను ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశంలోనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు.మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు మిగతా 2లో..

## ప్రధాని మోదీ దీర్ఘాయుష్షు కోసం
# మల్లన్నకు ప్రత్యేక పూజలు

**దేశానికి మరింత కాలం సేవలందించాలని ప్రార్థించిన ఎంపీ రఘునందన్ రావు**



కొమురవెల్లి, జూన్ 10 (ప్రజాజ్యోతి):భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానిగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మిగతా 2లో..

## గౌరవెల్లి కాలువల భూసేకరణ
# వేగవంతం చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల

సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి

సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్



2 లో




# దుబ్బాక పట్టణాభివృద్ధి కి అందరూ సహకరించాలి

ప్లాస్టిక్ రహిత దుబ్బాక లక్ష్యంగా ముందుకు సాగాలి

పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

ప్రక్రియను వేగవంతం చేయాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

2 లో

## హెల్మెట్ ఉంటేనే
# భద్రత

సురక్షిత ప్రయాణమే కుటుంబానికి నిజమైన కానుక

వీడియోలు కాదు.. ప్రమాద బాధితులను కాపాడండి

తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ గౌరవ శిఖా గోయల్



7 లో



## దేశానికే దిక్సూచిగా మహిళా శక్తి పథకం

మొదటి పేజీ తరువాయి..

తమ సొంత నిధులైన 199.08 కోట్లతో 553 టీజీఎస్ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు.ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా మారడం ప్రభుత్వ మహిళా సాధికారత విధానాల విజయానికి నిదర్శనమన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులు అందించామని తెలిపారు.దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల కొరత తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతున్నాయని, మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరు సమకూరుతోందన్నారు.

## ప్రధాని మోదీ దీర్ఘాయుష్షు కోసం మల్లన్నకు ప్రత్యేక పూజలు

మొదటి పేజీ తరువాయి..



మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, దేశ ప్రజలకు మరింత కాలం సేవలందించేలా శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి దీవెనేలు వుండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర విధానాలపై సీపీఐ మండిపాటు




సిద్ధిపేట అర్బన్ ,జూన్ 10,(ప్రజాజ్యోతి):పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఈ సమస్యలపై జూన్ 10న సిద్దిపేట కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్లో జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతోందని విమర్శించారు. పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరిగి సామాన్యుల జీవనం కష్టంగా మారిందన్నారు.విద్యా వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.జూన్ 10న జరిగే కలెక్టరేట్ నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పిల్లి రజిని, గజబింకారి బన్సీలాల్, శివలింగ కృష్ణ, కర్ణాల చంద్రం, ముంజ గోపి, రామగల్ల నరేష్, మిట్టపల్లి సుధాకర్, సంగెం మధు తదితరులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి కాలువల భూసేకరణ వేగవంతం చేయాలి

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి

### సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్ధిపేట,జూన్ 10,(ప్రజాజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన భూ కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి రెవెన్యూ అంశాలు, భూసేకరణ పురోగతి, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు వంటి అంశాలపై మండల, డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.గౌరవెల్లి ప్రాజెక్ట్ పరిధిలోని మూడు జిల్లాల్లో భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పూర్తి పారదర్శకతతో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టుల కోసం భూముల కేటాయింపుపై సమీక్ష నిర్వహించిన మంత్రి, టీటీడీ దేవస్థానం, ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్, మహిళా బజార్ ఏర్పాటుకు అవసరమైన భూముల కేటాయింపును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.చౌటపల్లి పారిశ్రామిక కారిడార్కు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని పరిశీలించి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో బడిబాట కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాల గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.విద్యార్థులు పాఠశాలలకు ఆసక్తిగా వచ్చేలా పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు, డీఈఓలు, ఎమ్మార్వోలు, ఎంఈఓలు, రెవెన్యూ మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# దుబ్బాక పట్టణాభివృద్ధి కి అందరూ సహకరించాలి

### ప్లాస్టిక్ రహిత దుబ్బాక లక్ష్యంగా ముందుకు సాగాలి

### పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలి

### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



దుబ్బాక ప్రతినిధి , జూన్ 10 (ప్రజా జ్యోతి): దుబ్బాక పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించి మరింత అభివృద్ధి బాటలో దూసుకెళ్లేందుకు కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. బుధవారం రోజున దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత – రవీందర్, వైస్ చైర్మన్ ఆశ సులోచన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పట్టణాభివృద్ధి ప్రజా సమస్యల సమీక్ష సమావేశానికి,ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....దుబ్బాక మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే గారు సమీక్షించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన కొత్త ప్రతిపాదన లు, నిధుల వినియోగం, మౌలిక వసతుల కల్పనపై కూడా సమీక్ష నిర్వహించారు.పట్టణ పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులపై



కూడా ఎమ్మెల్యే గారు సమీక్ష నిర్వహించారు. చెరువులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా సుందరీకరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే వర్షాకాలంలో నీటి నిల్వలు సక్రమంగా ఉండేలా చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ కార్యాలయాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ప్రజలకు అనుకూలంగా నిర్వహించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.దుబ్బాక నియోజకవర్గం పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి, ప్లాస్టిక్ రహిత దుబ్బాక లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే గారు అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, పరిశుభ్రమైన మరియు హరిత దుబ్బాక నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీల శుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిని సమీక్షించి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల సమస్యలను వార్డుల వారీగా సమీక్షించిన ఎమ్మెల్యే గారు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ పరిష్కార చర్యలు చేపట్టి దుబ్బాక పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ మెంబెర్ లు, అధికారులు పాల్గొన్నారు.

## మిట్టపల్లి భూ వివాదం

# కాంగ్రెస్ పాలనకు అగ్నిపరీక్ష



తెలంగాణ ప్రజలు ప్రతి ఎన్నికలో కేవలం ప్రభుత్వాలను మార్చడం కోసం ఓటు వేయరు. పాలనా విధానంలో మార్పు రావాలని, సామాన్యుల హక్కులకు రక్షణ కల్పించాలని, అధికార వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆశిస్తారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన మద్దతు వెనుక కూడా ఇదే ఆకాంక్ష ఉంది. అయితే సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో వెలుగు చూసిన భూ వివాదం ఇప్పుడు ఆ ఆశలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది కేవలం కొన్ని సర్వే నెంబర్లకు సంబంధించిన భూ వివాదం మాత్రమే కాదు; దాదాపు 200 కుటుంబాల భవిష్యత్తు, ఆస్తి హక్కులు, సామాజిక న్యాయం, ప్రభుత్వ జవాబుదారీతనానికి సంబంధించిన అంశంగా మారింది.

### మూడు దశాబ్దాల భూ వివాదం:

మిట్టపల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 974, 975, 978, 979, 988, 1005, 1006లకు సంబంధించిన భూముల వివాదం దాదాపు మూడు దశాబ్దాల చరిత్ర కలిగి ఉంది. మొదట ఈ భూములు రాగం మల్లయ్య పేరిట ఉండగా, ఆయన మరణానంతరం వారసత్వ హక్కుల విషయంలో వివాదం ప్రారంభమైంది. 1995 ప్రాంతంలో తహసీల్దార్ ఉత్తర్వుల ద్వారా రాగం యెల్లయ్య పేరు మాత్రమే రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడం, మిగిలిన వారసులు అభ్యంతరం వ్యక్తం చేయడం, అనంతరం ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, హైకోర్టు స్థాయిల వరకు వివాదం వెళ్లడం ఈ కేసు సంక్లిష్టతను సూచిస్తున్నాయి.కుటుంబ వారసత్వ వివాదంగా ప్రారంభమైన ఈ అంశం కాలక్రమేణా భూములు కొనుగోలు చేసిన మూడో వ్యక్తులు, రెవెన్యూ అధికారులు, న్యాయస్థానాలు భాగస్వాములైన పెద్ద భూ వివాదంగా మారింది. అందువల్ల ఇది సాధారణ పట్టా సవరణ కేసు కాదు; వారసత్వ హక్కులు, రెవెన్యూ రికార్డులు, సివిల్ హక్కులు పరస్పరం కలిసిపోయిన సంక్లిష్ట వివాదం.200 కుటుంబాల ఆస్తి హక్కులు, సామాజిక న్యాయం, పరిపాలనా పారదర్శకతపై తలెత్తిన కీలక ప్రశ్నలుఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం భూమి కాదు; ఆ భూములతో ముడిపడి ఉన్న కుటుంబాల భవిష్యత్తు. బాధితుల వాదన ప్రకారం, ఈ వివాదం ప్రభావం దాదాపు 200 కుటుంబాలపై పడుతోంది. తమ జీవితకాల పొదుపులతో, కష్టార్జిత సంపాదనతో ప్లాట్లు కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పుడు తమ హక్కుల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయి.ఈ వివాదంలో అసలు కేంద్ర ప్రశ్న ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అనేది కాదు. వారసత్వ వివాదం పరిష్కారం పేరుతో ఇప్పటికే చట్టబద్ధంగా కొనుగోలు చేసిన కుటుంబాల హక్కులు దెబ్బతింటున్నాయా లేదా అన్నదే ప్రధాన ప్రశ్న. ఎందుకంటే చాలామంది కుటుంబాలకు ఈ భూములు కేవలం ఆస్తి కాదు; వారి జీవితకాల శ్రమకు ప్రతిఫలం, వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా.ఈ ప్రభావిత కుటుంబాల్లో గణనీయమైన సంఖ్యలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం గురించి మాట్లాడే రాజకీయ నాయకులు అలాంటి కుటుంబాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. కానీ అదే వర్గాలకు చెందిన ప్రజలు తమ కష్టార్జిత ఆస్తులను కాపాడుకోవడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది కేవలం భూ వివాదంగా కాకుండా సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రశ్నగా కూడా మారుతుంది.ఈ వివాదంలో బాధిత కుటుంబాలు న్యాయం కోసం వివిధ స్థాయిల్లో పోరాటం సాగిస్తున్నాయి. వారి తరపున నేను కూడా ప్రారంభం నుంచి అందుబాటులో ఉన్న రికార్డులు, న్యాయపరమైన అంశాలను అధ్యయనం చేస్తూ, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాను. బాధిత కుటుంబాల ఆందోళనలను సంబంధిత వర్గాలకు చేరవేయడం, చట్టబద్ధ హక్కుల పరిరక్షణ కోసం గొంతుకగా నిలవడం ఒక సామాజిక బాధ్యతగా భావిస్తున్నాను.

### కలెక్టర్ ఉత్తర్వులపై తలెత్తుతున్న ప్రశ్నలు

05-12-2025న జిల్లా కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ నం. ఎ1/627/2025 ఈ వివాదాన్ని మరోసారి చర్చలోకి తీసుకొచ్చాయి. కలెక్టర్ పరిశీలనలో ఈ భూములు పూర్వీకుల ఆస్తి కావడంతో రాగం మల్లయ్య వారసులందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొనబడింది. అలాగే కొన్ని రెవెన్యూ నమోదులను సవరించాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి.అయితే ఈ నిర్ణయాలపై కొన్ని చట్టపరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే గతంలో ఈ భూములకు సంబంధించిన అనేక రిజిస్టర్డ్ సేల్ డీడ్లు, గిఫ్ట్ డీడ్లు నమోదయ్యాయి. పలు వ్యక్తులకు భూములు బదిలీ అయినట్లు రికార్డులు సూచిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో రెవెన్యూ రికార్డుల సవరణ మాత్రమే సరిపోతుందా? లేక సివిల్ హక్కులకు సంబంధించిన అంశాలను సివిల్ కోర్టులే తేల్చాలా? అనే ప్రశ్నలు బాధితుల తరపున లేవనెత్తబడుతున్నాయి.భూముల యాజమాన్యానికి సంబంధించిన వివాదాలను పరిష్కరించే క్రమంలో ఇప్పటికే కొనుగోలు చేసిన వ్యక్తుల హక్కులు, నమోదైన పత్రాల చెల్లుబాటు, వారసత్వ హక్కుల మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్నది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది.కలెక్టర్ ఉత్తర్వుల నేపథ్యంలో ఆయా సర్వే నెంబర్ల పరిధిలో మరియు చుట్టుపక్కల భూములు కలిగి ఉన్న సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులు రుణాలను తిరస్కరించడం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూ బదలాయింపులు నిలిపివేయడం వలన పేద, మధ్యతరగతి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. తమ స్వంత భూములు ఉన్నప్పటికీ వాటిపై హక్కులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడటం ప్రజల ఆస్తి హక్కులకు, జీవన భద్రతకు తీవ్రమైన భంగం కలిగిస్తోంది.

### వివాదం వెనుక రాజకీయ ఆరోపణలు

మిట్టపల్లి వివాదం కేవలం రెవెన్యూ లేదా వారసత్వ అంశంగా మాత్రమే మిగలలేదు. ఈ వ్యవహారంలో రాజకీయ ప్రభావం, రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు కూడా ఉన్నాయనే ఆరోపణలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి.ప్రత్యేకంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కుటుంబ సభ్యుల పేర్లు ఈ వివాదంలో ప్రస్తావనకు రావడం వల్ల ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పొన్నం ఇంటిపేరుతో ఉన్న కొందరు కుటుంబ సభ్యుల భూ లావాదేవీలు, వారి పాత్రపై బాధితులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ కారణంగానే తమ ప్లాట్ల హక్కులు ప్రమాదంలో పడ్డాయని వారు వాదిస్తున్నారు.ప్రజల ఓట్లతో ఎదిగిన నాయకులు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సంక్షేమం గురించి మాట్లాడే నాయకులు, అలాంటి వర్గాల కుటుంబాల ఆస్తి హక్కులకు భరోసాగా నిలవాలి. వారి హక్కులపై అనుమానాలు తలెత్తే పరిస్థితులు ఏర్పడకుండా చూడాలి. ప్రజాప్రతినిధులపై ప్రజలకు ఉండే నమ్మకం అలాంటి సందర్భాల్లోనే పరీక్షకు వస్తుంది.ఈ ఆరోపణలు నిజమా కాదా అనేది సంబంధిత వర్గాల వివరణలు, న్యాయపరమైన ప్రక్రియల ద్వారా స్పష్టమవాల్సి ఉంది. అయితే ప్రజల్లో తలెత్తిన అనుమానాలను ప్రభుత్వం విస్మరించలేడు. అందువల్ల ఈ అంశంపై పూర్తి పారదర్శకత అవసరం.

### ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ఉన్న అతిపెద్ద బాధ్యత ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం. మిట్టపల్లి భూముల వివాదం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అలాంటి పరీక్షగానే మారింది. ప్రభుత్వం పూర్తి వివరాలను, రికార్డులను ప్రజల ముందుంచాలి. వారసత్వ హక్కులు, కొనుగోలుదారుల హక్కులు, న్యాయపరమైన అంశాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి పారదర్శక పరిష్కారం చూపాలి.తుది న్యాయ నిర్ణయం వచ్చే వరకు ప్రభావిత కుటుంబాల హక్కులకు భరోసా కల్పించాలి. ఎందుకంటే మిట్టపల్లి వివాదం కేవలం భూముల గురించినది కాదు; ఇది ప్రజల ఆస్తి హక్కులు, పరిపాలనా జవాబుదారీతనం, సామాజిక న్యాయం, ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి సంబంధించిన అంశం.మార్పు కోసం ప్రజలు ఇచ్చిన తీర్పు నిజంగా పాలనా మార్పుగా మారిందా లేదా అన్నది ఇలాంటి సందర్భాల్లోనే పరీక్షకు వస్తుంది. సామాన్యుల ఆస్తి హక్కులను కాపాడడంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్నదే ఈ వివాదంపై ప్రజల తుది తీర్పును నిర్ణయిస్తుంది. మిట్టపల్లి వివాదం ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురైన ఒక ముఖ్యమైన పరీక్షగా నిలిచింది.

గాదగోని చక్రధర్ గౌడ్
9014062471

# ఏబీవీపి దుబ్బాక నూతన కమిటీ ఎన్నిక

## దుబ్బాక శాఖ నగర కార్యదర్శిగా శేర్ల జేశ్వంత్ ఎన్నిక



దుబ్బాక ,జూన్ 10 (ప్రజా జ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దుబ్బాక శాఖ ఆధ్వర్యంలో స్థానిక దిశా స్కూల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మెదక్ విభాగ్ (ఉమ్మడి జిల్లా) కన్వీనర్ సావుల ఆదిత్య పాల్గొని గత 77 ఏళ్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశసేవలో బాగంగా జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా సమాజ సేవ చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ కార్యకర్తలను ఉద్దేశించి మన మంతా జాతీయ భావాలతో దేశానికి సేవ చేస్తూ విద్యారంగ సమస్యలను పరిష్కరించుటకై కృషి చేయాలని దిశా నిర్దేశం చేసిన అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. అందులో భాగంగా దుబ్బాక నగర కార్యదర్శిగా మరోసారి శేర్ల జేశ్వంత్, నగర ఉపాధ్యక్షులుగా కుమార్, పవన్, సంయుక్త కార్యదర్శిగా సాయితేజ, రాజు, మహిళ కన్వీనర్ గా అఖిల, ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా అరవింద్, ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ గా సుమంత్, ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ గా శ్రీకాంత్, ఎస్ ఎఫ్ ఎస్ కో కన్వీనర్ గా దిశాంత్, ఖేల్ కన్వీనర్ గా తరుణ్ ని ప్రకటించారు. ఈ సమావేశంలో కార్తీక్ ,ప్రశాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముస్త్యాల మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి మాతృమూర్తి మృతి

## నివాళులర్పించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



చేర్యాల, జూన్ 10(ప్రజాజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఏల్లారెడ్డి మాతృమూర్తి పెడుతల మల్లమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం వెంటనే ముస్త్యాల గ్రామానికి చేరుకున్నారు.మల్లమ్మ భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డిని,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని కోరారు. వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు స్థానిక నాయకంలు,కార్యకర్తలు ఉన్నారు.



# ఎమ్మెల్యే ను కలిసిన శివగారి అంజయ్య

చేర్యాల జూన్10(ప్రజాజ్యోతి): నాలుగు మండలాల యూత్ మాజీ అధ్యక్షుడు శివగారి అంజయ్య తన పుట్టిన రోజు సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా అంజయ్య ఎమ్మెల్యే పల్లా ఆశీర్వాదం తీసుకున్నారు.శివగారి అంజయ్యకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు .భవిష్యత్తులో అంజయ్య మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి నవీన్ రెడ్డి,కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ చింతల పరశురాములు, చేర్యాల టౌన్ యూత్ మాజీ అధ్యక్షుడు యాట బిక్షపతి,పచ్చిమడ్ల సతీష్,పులన్నగారి రాజు,ఎరోళ్ళ పరశురాములు, రమేష్, తదితరులు ఉన్నారు.

# వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడును చోరీ

**చోరీ చేసిన మహిళ పట్టుకున్న ప్రజలు**

**కేసు నమోదు చేసి**

**రిమాండ్ కు తరలించిన పోలీసులు**



దుబ్బాక ప్రతినిధి , జూన్ 10 (ప్రజా జ్యోతి): ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న వృద్ధురాలు మెడలోంచి పుస్తెలతాడును తెంచుకొని పారిపోతున్న మహిళా దొంగను స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించిన ఘటన దుబ్బాక పట్టణంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాలు... సిద్దిపేటకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు వీరబత్తిని లక్ష్మి దుబ్బాకలో ఉంటున్న చిన్న కుమారుడు మహేష్ ను చూసేందుకు బుధవారం సిద్ధిపేట నుంచి దుబ్బాక బస్టాండ్ కు చేరుకుంది. అక్కడి నుంచి 15వ వార్డులో ఉండే చిన్న కుమారుడు ఇంటికి నడిచి వెళ్తోంది. ఈ క్రమంలో గాంధీ విగ్రహం సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద వెనుక నుంచి వచ్చిన రామక్కపేటకు చెందిన సిద్దుల రాజమణి అనే మహిళ వృద్ధురాలి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకొని, పారిపోబోయింది.వెంటనే వృద్ధురాలు గట్టిగా అరవడంతో అక్కడే ఉన్న కొంతమంది స్థానికులు మహిళా దొంగ రాజమణిని పట్టుకుని, పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితురాలని పోలీసులకు అప్పగించారు. విచారణలో తానే పుస్తెలతాడు చోరీ చేసినట్టు నిందితురాలు రాజమని అంగీకరించడంతో, దుబ్బాక పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# టీపిగురుతుల ఆత్మీయ కలయిక



## ఇరవై యేండ్ల చదువుకున్న చోటుకు

సిద్దిపేట, జూన్ 10 (ప్రజాజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఇరవై ఏండ్ల తరువాత ఒక్కచోట కలుసు కుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు.విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకు న్నారు. విద్యార్థులు అంత ఒకచోట చేరి, తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను , చిన్ననాటి అల్లరి, చదువుకున్న రోజులు, తోటి విద్యార్థులతో గడిపిన క్షణాలను గుర్తు చేసుకొని ఆనందంతో పరవశించిపోయారు.

**యోగక్షేమాలు, ఆత్మీయ పలకరింపులు ....**

మనమంత ఒక్క కుటుంబంగా కష్ట సుఖాలలో పాలుపంచుకుందాం అంటూ ఆత్మీ యంగా పలకరించుకున్నారు.అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు నారాయణ గౌడ్ ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి , యాదగిరి, నారాయణ ఆనంద చారి ,రాము లు, కాటం శ్రీనివాస్ ,మల్లారెడ్డి , బాలసరస్వతి లు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయు లను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్లా గౌడ్ , నరేష్, హరీష్ , కనకరాజు సాయిబాబా ,అశ్విని , రేణుకా తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన

**మండల విద్యాధికారి విజయభాస్కర్ రెడ్డి**



ములుగు,జూన్10(ప్రజా జ్యోతి)ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధనను అందించి ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో100% ఉత్తీర్ణత సాధించామని మండల విద్యాధికారి,ములుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ములుగులో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరిగి చదువుకునే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ అధికారి సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో దోహదపడతాయని,ప్రైవేటు పాఠశాలలలో ఉపాధ్యాయుల విద్యా బోధన కంటే ప్రభుత్వ పాఠశాలలలోని ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధనను అందించి మెరుగైన ఫలితాలు సాధించుటకు శాయశక్తుల కృషి చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని,పాఠశాలలలో మెరుగైన సౌకర్యాలు అందిస్తూ మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నట్లు ఆ తెలిపారు.ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రులతో అవగాహన సమావేశం



మిరుదొడ్డి, జూన్ 10, (ప్రజా జ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా మల్లుపల్లి గ్రామంలో బుధవారం తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి ప్రవీణ్ బాబు మాట్లాడుతూ ప్రతి బాలబాలిక విద్యను అభ్యసించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

### అభివృద్ధి దిశలో 15 వ వార్డు

### అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

### 15 వ వార్డు కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ - శ్రీనివాస్

దుబ్బాక ప్రతినిధి , జూన్ 10( ప్రజా జ్యోతి) 15వ వార్డ్ అభివృద్ధికి వార్డు సభ్యులంతా సహకరించాలని కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ – శ్రీనివాస్ అన్నారు. బుధవారం రోజున 15వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డ్ ఆఫీసర్ జ్యోతి మేడం తో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ మాట్లాడుతూ... వచ్చే వర్షాకాలంలో తీసుకునే జాగ్రత్తలు, విష జ్వరాల నుంచి






మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో వారికి వివరించి తెలిపారు. మరియు అంగన్వాడి పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్వాడిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. వార్డు ప్రజలు తమ చెత్తను తడి చెత్తగా పొడి చెత్తగా వేడివేడి చేసి మున్సిపల్ వాహనంలో వేయాలని సూచించారు. మహిళలకు మహిళ శక్తి ఆధ్వర్యంలో ఇచ్చే రుణాల గురించి వివరించి అలాగే ఎవరైనా వృద్ధులు వికలాంగులు వితంతువులు పెన్షన్ రాకుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందుతుందని ఎవరు కూడా అధైర్యపడవద్దని కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ సూచించారు. ఇప్పటికే 15వ వార్డులో డ్రైనేజీలు సిసి నిర్మాణాలు జరుగుతున్నాయని వారు తెలిపారు . ఇంకా ఎవరింటి వద్దనైనా డ్రైనేజీ నిర్మాణం ఇబ్బందిగా ఉంటే తెలపాలన్నారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల నిరసన..

## బతుకమ్మ ఆడి ఆగ్రహం వ్యక్తం



కొండపాక, జూన్ 10 (ప్రజా జ్యోతి): కొండపాక మండలం బందారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు బుధవారం నిరసనకు దిగారు. ప్రతిరోజు మాదిరిగానే చెరువులో మట్టి తీయడానికి సుమారు 250 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. అయితే, కూలీల హాజరు నమోదు కోసం తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఫోటో క్యాప్చర్ ప్రక్రియ చేపట్టేందుకు సంబంధిత సిబ్బంది సమయానికి రాకపోవడంతో కూలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గంటల తరబడి వేచి చూసినప్పటికీ అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంతో కూలీలు ఆందోళనకు దిగారు. మహిళా కూలీలు బతుకమ్మ ఆడి తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.అదేవిధంగా, పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదులు చేస్తే తాము ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు గురిచేస్తున్నారని కొందరు కూలీలు ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత జీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిపై పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.సమస్యకు తక్షణ పరిష్కారం లభించకపోవడంతో, చేసేదేమీ లేక ఉపాధి హామీ కూలీలు తిరిగి ఇంటి బాట పట్టారు. ఉపాధి హామీ పనుల్లో ఇలాంటి నిర్లక్ష్య వైఖరి కారణంగా తమకు ఉపాధి దినాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.'పనికి వచ్చాం.. హాజరు తీసుకోలేదు.. అధికారులు పట్టించుకోలేదు. దీంతో రోజంతా వేచి చూసి నిరసన తెలిపి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది' అని కూలీలు వాపోయారు.



## విద్యుత్ షాక్ తో బాలుని మృతి

### మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

### దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు వెల్లడి



దుబ్బాక ప్రతినిధి జూన్ 10 ( ప్రజా జ్యోతి): సెలవుల్లో సరదాగా గడిపేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం....... నారాయణరావుపేట మండలం మలక్యాలకు చెందిన శంకర్ గౌడ్ కు భార్య నిర్మల, కుమారుడు చరణ్ తేజ (11), కుమార్తె ప్రవీణ ఉన్నారు. చరణ్ తేజ తన అక్కతో కలిసి సెలవులను గడిపేందుకు దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి మంగళవారం సాయంత్రం వచ్చారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అక్కతో కలిసి బాలుడు రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ యొక్క ఎర్తింగ్ తీగ బాలుడి కుడి చేతికి తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో వెంటనే కిందపడి అపస్మారక స్థితికి చేరిన బాలుడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన సిద్దిపేట జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని మేనమామ భానుచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.



## తెలంగాణ కుమ్మరుల సంఘం

## నియోజకవర్గ కన్వీనర్ గా కుమ్మరి నాగరాజు



దౌల్తాబాద్,జూన్.10 ( ప్రజా జ్యోతి): తెలంగాణ కుమ్మరుల సంఘం దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ గా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు ను నియమిస్తూరాష్ట్ర కో ఆర్డినేటర్ అమరవాది సారంగపాణి.రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా కుమ్మరుల సంఘం నియోజ కవర్గ కన్వీనర్ గా నియమితులైన నగారాజు విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గం బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర రాష్ట్ర వ్యవస్థపకులు.ఆకారం మోహన్ కు. అయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరుల న్యాయమైన హక్కుల సాధన కోసం అందుబాటులో ఉండి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యా ఉద్యోగ . రాజకీయ రంగాల్లో కుమ్మరులకు తగిన ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రభుత్వంతో కొట్లాడు తామని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న కుమ్మరులను చైతన్యం చేసి గ్రామ గ్రామాన యూత్ కమిటీలు వేసి చైతన్యం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఇందుకు ఆయా గ్రామాల కుమ్మరుల సహాయ సహకారాలతో తమకు న్యాయమైన హక్కుల వాట కోసం అందరిని చేతనం చేసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తనకు కమిటీలో పదవి రావడం ఎంతో సంతోషంగా ఉందని. అదే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

### ఎంపీ రఘునాథన్ రావు



కొండపాక జూన్ 10 (ప్రజా జ్యోతి ): కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్పల్లి శివారులో ఉన్న హిడెన్ క్యాస్టల్ రిసార్ట్స్లో రహస్యంగా నిర్వహించినట్లు చెబుతున్న భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశంలో, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపీ. రఘునందన్ రావు పిలుపునిచ్చినట్లు సమాచారం.ఈ సందర్భంగా పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించినట్లు సమావేశంలో సూచించినట్టు సమాచారం. సమాజంలో హిందువుల పట్ల జరుగుతున్న పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తరించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించినట్లు సమాచారం. సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిసింది.

## ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలోనే ఉన్నంత విద్య

### ప్రధానోపాధ్యాయులు బాసిత్



దౌల్తాబాద్, జూన్ 10: ( ప్రజా జ్యోతి) ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నంత విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు బాసిక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దొమ్మాట జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు రెండు పడకల గృహ సముదాయం నుంచి దొమ్మాట ఉపాధి హామి కూలీలు పని ప్రదేశం వరకు సాగిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాటలో విద్యార్థులు, తలిదండ్రులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల లకు ధీటుగా సైన్స్ ల్యాబ్, అత్యుత్తమ డిజిటల్ బోధనతో పాటు వారానికి ఆరు రోజు వుచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, రుచి కరమైన రోజుకో రకమైన టిఫిన్, మధ్యాహ్న భోజనం, వారానికి మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావతో విద్యార్థులకు పుష్టికరమైన ఆహారాన్ని ప్రభుత్వం వుచితంగా అందజేస్తున్నందున బడుగు వర్గాల పిల్లలు అట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దొమ్మాట జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బాసిత్ దొమ్మాట శ్రామిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కాగా హైస్కూలు లో విశాల క్రీడా మైదానంలో వివిధ క్రీడల్లో నైపుణ్యం గల ఉపాధ్యాయుల తో తగు విధంగా శిక్షణ జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు బాసిత్ అన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 30 మంది విద్యార్థులందరూ వుత్తీర్ణులై 100% ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు కృషితోనే 100% విద్యార్థులు ఫలితాలు సాధించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సి అర్ పి రాజు, ఉపాధ్యాయులు జి.రాజేశ్వర్, యన్.కిషన్ రెడ్డి తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

### సర్పంచ్ మానస

కొండపాక జూన్ 10( ప్రజా జ్యోతి):గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం కొరకు ప్రజలు సహకరించాలని మండలంలోని వెలికట్ట గ్రామ సర్పంచ్ మానస సురేందర్ రావు పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో తీవ్ర అనర్థాలు ఏర్పడతాయని దాన్ని పూర్తిగా నిషేధిద్దామని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పంటల మార్పిడి పై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ఏవైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.జిపిఓ అంజయ్య ,పంచాయతీ కార్యదర్శి రవికుమార్ , పాక్స్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు , ఏఎంసి డైరెక్టర్ పెరుగు తిరుపతి, ఉప సర్పంచ్ అమ్ముల పరశురాములు , ఏఈఓ సుస్మిత, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మాత్ పల్లిలో....

మత్ పల్లి గ్రామంలో సర్పంచ్ బచ్చలి శ్రీలత మహిపాల్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం కోసం అందరూ సహకరించాలని





కోరారు. లక్ష్మిమనోహర్ రావు ముందుకు వచ్చి గ్రామానికి 50.000 వేయిలు రూపాయలు ఖర్చు చేసి గ్రామానికి 300 వందల ప్లేట్లు 300 వందల గ్లాస్ లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్ , ఎంపీ ఓ నాగభూషణం ఎంఈఓ బచ్చలి సత్తయ్య ,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ ,గ్రామ ఉప సర్పంచ్ లింగం తదితరులు పాల్గొన్నారు.


### పరిసరాల పరిశుభ్రత పై అవగాహన

కొండపాక జూన్ 10 కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ రావు వర్షాకాలం సీజన్లను దృష్టిలో పెట్టుకుని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు . బుధవారం గ్రామంలో ప్రజలకు చెత్త సేకరణ అవగాహన కల్పించారు.ప్రతి రోజు చేత్త ను సేకరించే గ్రామపంచాయతీ ట్రాక్టర్ లోనే నాలుగు రకాల డబ్బాలు ఏర్పాటు చేసి వినూత్న పద్ధతి లో గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు . ఇళ్లలో ని తడి పొడి చెత్త, ఇతర ప్లాస్టిక్, సీసా గాజు పెంకులు,మురికి కాలువల్లో, రోడ్ల పక్కనో పడేయడం వల్ల గ్రామ ప్రజలు వ్యాధుల భారిన పడుతరన్నారన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి గ్రామ పంచాయతీ సిబ్బందికి ట్రాక్టర్ కి అందజేయాలన్నారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ , బూరుగుల సురేందర్ రావు , ఉపసర్పంచ్ పర్షరాములు వార్డు సభ్యులు ముత్యం రావు బాస్కర్ గ్రామ పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# ఐకేపీ సెంటర్ నిర్వాహకుడి తీరుపై రైతుల ఆగ్రహం

### వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం 10 రోజులు గడిచినా ట్యాబ్ ఎంట్రీలు నమోదు కాక రైతుల ఆందోళన

దౌల్తాబాద్,జూన్ 10 (ప్రజా జ్యోతి) వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం పది రోజులు గడిచిన ట్యాబ్ ఎంట్రీలు నమోదు కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. దౌల్తాబాద్ ఐకెపి సెంటర్ తీరుపై రైతులు ఆగ్రహం దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న సామెతను తలపించేలా దౌల్తాబాద్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు నెలల తరబడి ఎదురుచూసినప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకుంటున్న జాప్యాలు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినప్పటికీ, స్థానిక స్థాయిలో నిర్వహణలో లోపాల కారణంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆరోపిస్తున్నారు. దౌల్తాబాద్ ఐకేపీ కేంద్రంలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేసి పది రోజులు గడిచినప్పటికీ, సంబంధిత ట్యాబ్ ఎంట్రీలు నమోదు చేయకపోవడంతో రైతులు చెల్లింపుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల కథనం ప్రకారం, ధాన్యం కేంద్రానికి తరలించి తూకం వేసి కొనుగోలు చేసిన తర్వాత వెంటనే ట్యాబ్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ అవుతాయి. అయితే కొనుగోలు జరిగిన పది రోజులు గడిచినా ట్యాబ్ ఎంట్రీలు నమోదు కాకపోవడంతో చెల్లింపులు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఐకేపీ సెంటర్ నిర్వాహకుడు యాదగిరిని రైతులు ప్రశ్నించగా, మిల్లు యాజమాన్యంతో మాట్లాడిన తర్వాత ట్రక్ షీట్ నమోదు చేస్తాం అని సమాధానం ఇచ్చినట్లు రైతులు తెలిపారు. మిల్లు యాజమాన్యంతో సంప్రదింపుల పేరుతో ట్యాబ్ ఎంట్రీలు వాయిదా వేయడం వల్ల రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల కోసం చేసిన అప్పులు తీర్చాల్సి ఉండటం, తదుపరి పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితుల్లో చెల్లింపుల జాప్యం రైతులపై అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కోట్ల



రూపాయలు వెచ్చిస్తూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దౌల్తాబాద్ ఐకేపీ కేంద్రంలో పెండింగ్లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయించి, రైతులకు చెల్లింపులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యాలకు కారణమైన అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేసి ధాన్యం కొనుగోలు అనంతరం ఆలస్యం లేకుండా ట్రక్ షీట్లు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది




సిద్ధిపేట అర్బన్ ,జూన్ 10,(ప్రజాజ్యోతి):తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ విమర్శించారు.సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికార దుర్వినియోగంతో బీజేపీ దేశవ్యాప్తంగా తన పెత్తనం కొనసాగించాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉంటే వారిని గుర్తించి పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని త్వరలోనే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, మార్క సతీష్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ఉంటేనే భద్రత

### సురక్షిత ప్రయాణమే కుటుంబానికి నిజమైన కానుక

### వీడియోలు కాదు.. ప్రమాద బాధితులను కాపాడండి

### తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ గౌరవ శిఖా గోయల్




సిద్ధిపేట,జూన్ 10,(ప్రజాజ్యోతి):నేరాల కంటే రహదారి ప్రమాదాల వల్లే అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ గౌరవ శిఖా గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రహదారి భద్రత అవగాహన సదస్సు బుధవారం ఘనంగా జరిగింది. సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ శిఖా గోయల్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు రహదారి భద్రతపై కీలక సందేశాన్ని అందించారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఐఏఎస్, పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీఎస్తో కలిసి డీజీ శిఖా గోయల్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాష్ట్రంలో సుమారు 8 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, వీటిలో ఎక్కువ ప్రమాదాలు గ్రామీణ ప్రాంతాల్లోనే చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. సురక్షితంగా బయలుదేరి.. సురక్షితంగా ఇంటికి చేరడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆమె అన్నారు.పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రహదారి నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చున్నారు.ఇటీవల మిట్టపల్లి వద్ద జరిగిన ఘోర ప్రమాదాన్ని గుర్తు చేస్తూ, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం ప్రాణాలను రక్షిస్తుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బాధి తులకు సీపీఆర్ అందించడం ద్వారా విలువైన ప్రాణా లను కాపాడవచ్చని వివరించారు.జిల్లా కలెక్టర్ కె. హైమా వతి మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడం కంటే, వెంటనే అంబులెన్స్కు సమాచారం అందించి బాధితు లను రక్షించడమే నిజమైన మానవత్వమన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఉచిత కంటి అద్దాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తామని, రహదారి భద్రతకు కట్టుబడి ఉంటామని పాల్గొన్న వారందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




# భావితరాలకు ప్లాస్టిక్ రహిత పర్యావరణం అందిద్దాం

సిద్ధిపేట,జూన్ 10,(ప్రజాజ్యోతి):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త పి. రవీందర్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-99 రోజులలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ములుగు మండలం కరకపట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత ప్రాంగణాల ఏర్పాటుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 21 పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల పర్యావరణహిత ఉత్పత్తులపై ప్రత్యేక వర్క్షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల నేల, నీరు, జీవవైవిధ్యానికి కలిగే నష్టాలను వివరించిన ఆయన, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి పరిశ్రమలు ముందుండాలని పిలుపునిచ్చారు.పరిశ్రమల ప్రతినిధులు మాట్లాడుతూ, తమ సంస్థల్లో పర్యావరణహిత విధానాలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో నార సంచులు, బట్ట సంచులు వినియోగించడంతో పాటు, ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా మట్టి పాత్రలు, చెక్క స్పూన్లు, పర్యావరణహిత గ్లాసులను ఉపయోగిస్తామని వెల్లడించారు.ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనలో పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం పరిశ్రమల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంపొందించడంతో పాటు, ప్లాస్టిక్ రహిత ప్రాంగణాల ఏర్పాటుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

